## క్లుప్తంగా

### ఎంపీ నిధులతో సీసీ రోడ్డు నిర్మాణం ప్రారంభం



**పాగోలు(చల్లపల్లి):** మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి నిధులతో పాగోలు ఎస్సీ కాలనీలో సోమవారం సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టారు. పాగోలు ఎంపీటీసీ సభ్యుడు మేకా సత్యనారాయణ ప్రసాద్ (బంగారుబాబు) ప్రతిపాదన మేరకు ఎంపీ బాలశౌరి సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.10 లక్షలు మంజూరు చేశారు. దీనికి తోడు గ్రామ పంచాయతీ నిధులు రూ.2 లక్షలు కలిపి రోడ్డు నిర్మాణం చేపట్టారు. జెడ్పీటీసీ రాజులపాటి కళ్యాణి, సర్పంచ్ తోట శ్రీనివాసరావు, ఎంపీటీసీ బంగారుబాబు పూజలు చేసి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు రాజులపాటి శివప్రసాద్, ఇంజినీరింగ్ సెక్రటరీ పుష్పశ్రీ పాల్గొన్నారు.

### వైఎస్సార్ బీమా నగదు అందజేత



**నడకుదురు(చల్లపల్లి):** ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వ్యక్తి కుటుంబానికి వైఎస్సార్ బీమా పథకం ద్వారా తక్షణ సాయాన్ని గ్రామ సర్పంచ్ గొరిపర్తి సురేష్ బాబు అందజేశారు. నడకుదురు పంచాయతీ పాత నడకుదురు గ్రామానికి చెందిన ఆరేవరపు వెంకటేశ్వరరావు ఇటీవల గ్రామంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందగా ప్రమాద బీమా మంజూరైంది. సోమవారం రూ.10 వేలను మృతుడి భార్య వరలక్ష్మికి సర్పంచ్ అందజేశారు. కార్యక్రమంలో వెల్ఫేర్ అసిస్టెంట్ సుధాకర్ పాల్గొన్నారు.

### తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు

**కోనేరుసెంటర్:** గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కిట్టు తెలిపారు. మండల పరిధిలోని పెదయాదర గ్రామంలో 3 లక్షల రూపాయలతో ఏర్పాటుచేసిన మైక్రో ఫిల్టర్‌ను సోమవారం కిట్టు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని మారుమూల గ్రామాలకు సైతం తాగునీరు అందించాలన్నదే లక్ష్యమన్నారు. మండలంలో తాగునీటికి ఏ ఒక్కరూ ఇబ్బంది పడకూడదనే ఆలోచనతో సాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

### విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించండి

**మచిలీపట్నంటౌన్:** విద్యార్థుల్లో సృజనాత్మకత, నైపుణ్యాన్ని పెంపొందించేందుకు విజ్ఞానశాస్త్ర ఉపాధ్యాయులు కృషి చేయాలని డీఈవో తాహెరాసుల్తానా సూచించారు. నగరంలోని రుస్తుంబాద బాలికల ఉన్నత పాఠశాల (పార్కు స్కూల్)లో మచిలీపట్నం డివిజన్‌లోని ఆరు మండలాలకు చెందిన అన్ని యాజమాన్యాల ఉన్నత, ప్రాథమికోన్నత పాఠశాలల విజ్ఞానశాస్త్ర ఉపాధ్యాయులకు సోమవారం ఇన్‌స్పైర్ మనక్ ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న డీఈవో మాట్లాడుతూ విద్యార్థులు విజ్ఞాన సముపార్జన కోసం అనేక రకాల పోటీల్లో పాల్గొనే అవకాశం ఉందని దీని కోసం విద్యార్థులను సంసిద్ధులను చేయాలని ఆమె ఉపాధ్యాయులకు సూచించారు. ఇన్‌స్పైర్ మనక్ పథకం ద్వారా ఇప్పటికే జిల్లాకు చెందిన పలువురు విద్యార్థులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో జరిగిన పోటీలకు అర్హత సాధించారన్నారు. సైన్స్‌పరంగా కృష్ణాజిల్లా అంతర్జాతీయ గుర్తింపు సాధించటం గర్వకారణమని చెప్పారు. కార్యక్రమంలో మచిలీపట్నం డీవైఈవో యుపీ సుబ్బారావు, ఎంఈవో దుర్గాప్రసాద్, జిల్లా సైన్స్ అధికారి మొహమ్మద్ జాకీర్‌అహ్మద్, రిసోర్స్ పర్సన్లు బి సురేష్‌కుమార్, ఐ స్టాలిన్ పాల్గొన్నారు.

### సహకార సంఘాల రుణాలను రద్దు చేయాలి

**పెడన:** సహకార సంఘాల రుణాలను రద్దు చేయాలని ఏపీ చేనేత కార్మిక సంఘం ఏఐటీయూసీ నాయకుడు కట్టా హేమసుందరరావు డిమాండ్ చేశారు. జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలో ప్రదర్శన నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రధాన మంత్రిగా నరేంద్ర మోదీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి చేనేతపై జీఎస్టీ విధించి చేనేత పరిశ్రమ భూస్థాపితం చేయడానికి ప్రయత్నిస్తున్నారన్నారు. ఆరేళ్లుగా సహకార సంఘాలకు రావాల్సిన రిబేటు, సబ్సిడీ, పావలా వడ్డీ బకాయిలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. శుభోదయం చేనేత సహకార సంఘం వద్ద కృష్ణాజిల్లా చేనేత కార్మిక సంఘం కార్యదర్శి భూసం బాలసుబ్రహ్మణ్యం చేనేత జెండాను ఆవిష్కరించారు. అనంతరం మహాత్మాగాంధీ విగ్రహం వరకు ప్రదర్శనగా వెళ్లి పూలమాలలు వేశారు. నాయకులు పిల్లలమర్రి బాలకృష్ణ, పి.నరసింహారావు, రావూరి భాస్కరరావు, బట్ట కోట సుబ్రహ్మణ్యం, ఊటుకూరు చినమయ లింగం, గోరు రాజు పాల్గొన్నారు.

# జగనన్నకు అండగా ఉందాం

- గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు
- గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మంత్రి జోగి రమేష్



పాతబల్లిపర్రు గ్రామంలో ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న మంత్రి జోగి రమేష్, నాయకులు

**పెడన:** మన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిరుపేదల పట్ల సానుకూలంగా ఉండటమే కాకుండా వారి సంక్షేమానికి పెద్ద పీట వేస్తూ అహర్నిశలు శ్రమిస్తున్నారని, అటువంటి వ్యక్తికి మనమంతా అండగా ఉందామని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ అన్నారు. మండల పరిధిలోని బల్లిపర్రు గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో భాగంగా మంత్రి రమేష్ సోమవారం ఇంటింటికీ వెళ్లి వారు సంక్షేమ పథకాలు ద్వారా పొందిన లబ్ధిని వివరిస్తూ, వారి సమస్యలు అడిగి తెలుసుకుంటూ ముందుకు సాగారు. ఈ సందర్భంగా మంత్రి జోగి రమేష్ మాట్లాడుతూ.. పింఛన్లు, రైతు భరోసా, అమ్మ ఒడి, డ్వాక్రా రుణ మాఫీ, పంటల బీమా వంటి మరెన్నో పథకాలు అందిస్తున్న జగనన్నకు అండగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ పథకాలన్నీ ఎవరిస్తున్నారని ప్రశ్నించగా జగనన్న అంటూ లబ్ధిదారులు ముక్తకంఠంతో బదులిచ్చారు. ఇంత మంచి చేస్తున్న జగనన్నకు మద్దతు పలికి అండగా ఉండాలని మంత్రి లబ్ధిదారులకు సూచించారు.

**రహదారుల నిర్మాణం.. పింఛన్ల మంజూరు**

గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలని సచివాలయ ఉద్యోగులను మంత్రి జోగి రమేష్ ఆదేశించారు. పాత బల్లిపర్రు నుంచి మెయిన్ రోడ్డును అభివృద్ధి చేయాలని గ్రామస్తులు కోరారు. ఒకటో వార్డులో దాసరి రంగయ్య వార్డు మెంబర్ తదితరులు తమ ఇళ్ల వద్ద రోడ్డు వేయించాలని కోరగా సీసీ రోడ్డు వేయిస్తానని మంత్రి వారికి హామీ ఇచ్చారు. సీసీ రోడ్డు పనులు వెంటనే అంచనాలు రూపొందించాలని ఇంజినీరింగ్ అసిస్టెంట్‌ను ఆదేశించారు. వాసన జయ హర్షకు దివ్యాంగ పింఛన్ మంజూరు చేయించాలని అతని తండ్రి ఓంకార్ కోరగా, స్లాట్ బుక్ చేయించి, సదరం సర్టిఫికెట్ ఇప్పించి, పింఛన్ మంజూరు చేయాలని సచివాలయ సిబ్బందిని మంత్రి ఆదేశించారు. ముద్దినేటి వెంకట నరసమ్మ మంచినీటి కనెక్షన్ మంజూరు చేయాలని కోరగా, గ్రామంలో సీపీడబ్ల్యూఎస్ స్కీం నుంచి కుళాయి కనెక్షన్ మంజూరుకు చర్యలు తీసుకోవాలని సచివాలయం, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు సూచించారు. అనంతరం గ్రామంలో వివిధ పథకాల కింద పొందుతున్న లబ్ధి వివరాలను మంత్రి వెల్లడించారు. 364 మందికి పింఛన్లు, 112 మందికి వైఎస్సార్ చేయూత, 91 మందికి కాపు నేస్తం, 179 మందికి అమ్మఒడి, 52 మందికి జగనన్న విద్యా దీవెన, 48 మందికి జగనన్న వసతి దీవెన, 63 మందికి జగనన్న తోడు, 23 మందికి వాహన మిత్ర, 480 మందికి రైతు భరోసా పథకాలు ప్రభుత్వం అందిస్తోందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ రాజులపాటి వాణి, మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ గరికపాటి చారుమతి, పార్టీ మండల కన్వీనర్ కొండవీటి నాగబాబు, మాజీ ఎంపీపీ అచ్యుతరావు, గరికపాటి వెంకట రామానాయుడు, తహసీల్దార్ మధుసూదనరావు ఎంపీడీవో రెడ్డయ్య, ఎంఈఓ 2 హరనాథ్, ఆర్బీకే చైర్మన్ మేకల రవీంద్ర కుమార్, పామర్తి బెనర్జీ, వివిధ శాఖల అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

### పారదర్శకంగా ఓటర్ల జాబితా సవరణ

ఆర్డీవో కిషోర్



**చిలకలపూడి(మచిలీపట్నం):** డివిజన్ పరిధిలో పారదర్శకంగా ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు బందరు ఆర్డీవో ఐ.కిషోర్ తెలిపారు. ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమంపై ఆయన కార్యాలయంలో సోమవారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఆర్డీవో మాట్లాడుతూ ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ తమ ఓటు ఏ ప్రాంతంలో ఉంది, ఏ పోలింగ్‌బూత్‌లో ఉందో సరిచూసుకోవాలన్నారు. ఏమైనా అభ్యంతరాలు ఉంటే పరిశీలనకు వచ్చే సిబ్బందికి తెలియజేయాలని సూచించారు. ప్రతి మంగళవారం ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమంపై రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహిస్తున్నామని, వారి నుంచి కూడా అభ్యంతరాలు స్వీకరించి పటిష్టంగా ఓటర్ల జాబితాను తయారు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఒకే డోర్ నెంబరులో ఎక్కువ ఓట్లు ఉన్నా, అలాగే డోర్ నెంబరు లేని ఓటర్లు ఉన్న ప్రాంతాల్లోనూ ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నోషన్ నెంబర్లను కేటాయిస్తున్నామన్నారు. ఎటువంటి పొరపాట్లకు తావు లేకుండా ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆర్డీవో కోరారు.

## చేనేత రంగానికి సీఎం వైఎస్ జగన్ పెద్దపీట

ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సింహాద్రి, నాయకులు

**ఘంటసాల(అవనిగడ్డ):** రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేనేత రంగానికి పూర్వ వైభవం తీసుకొచ్చేలా ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు చెప్పారు. ఘంటసాల ఘోటకం కమ్యూనిటీ హాల్‌లో సోమవారం జాతీయ చేనేత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే సింహాద్రి మాట్లాడుతూ.. కరోనా కష్టకాలంలో పనులు లేక ఇబ్బందులు పడుతున్న చేనేత కార్మికులకు ప్రభుత్వం అండగా నిలిచిందన్నారు. ఘంటసాల మండలంలో 300 మంది చేనేత కార్మికులకు రూ.3.60 కోట్లు సంక్షేమ పథకాల ద్వారా అందించామని చెప్పారు. సీఎం జగన్‌కు ప్రజల్లో పెరుగుతున్న ఆదరణ చూసి ఓర్వలేక చంద్రబాబు అల్లర్లు సృష్టించి రెచ్చగొట్టే కార్యక్రమాలకు తెరతీశారని చెప్పారు. చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ కుట్రలను ప్రజలు గమనిస్తున్నారని, వచ్చే ఎన్నికల్లో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి విజయం తథ్యమని తెలిపారు. ఈ సందర్భంగా ఐదుగురు చేనేత కార్మికులను ఎమ్మెల్యే సింహాద్రి సత్కరించారు. జ్ఞానోదయ వీవర్స్ సొసైటీ అధ్యక్షుడు జానం సుధాకర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఘంటసాల ఏఎంసీ చైర్మన్ వేమూరి వెంకట్రావ్, ఎంపీపీ తుమ్మల రజనీ కుమారి, మండల సచివాలయాల కన్వీనర్ వేమూరి ప్రవీణ్, బీసీ సెల్ నేత పడమట వీరకుమార్, మాజీ సర్పంచ్ తాతా సీతారామయ్య, జలదీశ్వర చేనేత సహకార సంఘం అధ్యక్షుడు తిరందాసు భావనారుషి, జె.సోమసుందరరావు, పలువురు చేనేత కార్మికులు పాల్గొన్నారు.

## సంక్షేమ ప్రదాత ముఖ్యమంత్రి వైఎస్ జగన్



ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న పేర్ని కిట్టు, డెప్యూటీ మేయర్ మాడపాటి విజయలక్ష్మి

**మచిలీపట్నంటౌన్:** రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సంక్షేమ ప్రదాతగా పేరొందారని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) అన్నారు. నగరంలోని 26వ డివిజన్‌లోని సన్నాలవారివీధిలో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు అందిన సంక్షేమ పథకాల వివరాలతో ముద్రించిన బుక్‌లెట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మునుపెన్నడూ ఏ ప్రభుత్వం అమలు చేయని పలు సంక్షేమ పథకాలను రూపొందించి అమలు చేయటం వల్ల రాష్ట్రంలోని ప్రతి కుటుంబం లబ్ధి పొందిందన్నారు. దీంతో రాష్ట్రంలో పేదరికం తగ్గిందని చెప్పారు. జగనన్న ప్రభుత్వంలో తనకు జగనన్న వసతి దీవెన ద్వారా రూ.1062, వైఎస్సార్ సున్నా వడ్డీ రూ. 6,104, జగనన్న విద్యాదీవెన ద్వారా రూ.1758, వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా రూ.43,444, వైఎస్సార్ పింఛను కానుక ద్వారా రూ.64,250 మొత్తం రూ.1,16,618లతో పాటు ఇంటి స్థలం మంజూరైందని ఆ ప్రాంతానికి చెందిన షేక్ నజియా తెలిపి, ఆనందం వ్యక్తం చేసింది. డెప్యూటీ మేయర్ మాడపాటి విజయలక్ష్మి, కార్పొరేటర్లు మాచవరపు రాంప్రసాద్, రాసంశెట్టి వాణిశ్రీ, కో–ఆప్షన్ సభ్యుడు బేతపూడి రవి, మాజీ కౌన్సిలర్ మాడపాటి వెంకటేశ్వరరావు, నాయకులు బూరగ రామారావు, చిట్టిబోయిన జగన్నాథం, పురంశెట్టి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

**పేదల కోసమే ప్రభుత్వ పథకాలు**

**కోనేరుసెంటర్:** పేదల కోసమే రాష్ట్ర ప్రభుత్వం పథకాలు అందజేస్తోందని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కిట్టు అన్నారు. మండల పరిధిలోని నెలకుర్రు గ్రామంలో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందుతున్నది లేనిది అడిగి తెలుసుకున్నారు. పెన్షన్ల పంపిణీ కార్యక్రమం ఏ విధంగా జరుగుతున్నది ఆరా తీశారు. సచివాలయం సిబ్బంది, వలంటీర్ల పనితీరును అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ సేవలు మారుమూల గ్రామాలకు సైతం చేరాలనే సదుద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థను ప్రారంభించారని ఈ వ్యవస్థలో పనిచేస్తున్న సిబ్బంది సేవలను గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. అన్ని అర్హతలు ఉండి ప్రభుత్వ పథకాలు అందని వ్యక్తులు ఎవరైనా ఉంటే తనను నేరుగా కలవాలని సూచించారు. తక్షణమే వారికి లబ్ధి చేకూరేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గ్రామ ఇన్‌చార్జి బాసిశెట్టి సురేంద్రబాబు, మాజీ ఎంపీటీసీ బొమ్మసాని వెంకటేశ్వరరావు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## ప్రజా గాయకుడు గద్దర్‌కు ఘన నివాళి



నివాళులర్పిస్తున్న దళిత జేఏసీ నాయకులు

**మచిలీపట్నంటౌన్:** ప్రజా గాయకుడు, విప్లవ కవి గద్దర్ మృతికి మచిలీపట్నం దళిత జేఏసీ ఆధ్వర్యంలో సోమవారం ఘన నివాళులర్పించారు. స్థానిక అంబేడ్కర్ సర్కిల్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద గద్దర్ చిత్రపటానికి జేఏసీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. దళిత జేఏసీ జిల్లా అధ్యక్షుడు జక్కుల ఆనందబాబు(జానీ) మాట్లాడుతూ.. ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో పేదల పక్షాన నిలబడి వారి హక్కుల పరిరక్షణకు తనదైన శైలిలో గేయాల ద్వారా ప్రభుత్వాల్లో కదలిక తీసుకువచ్చిన వ్యక్తి గద్దర్ అన్నారు. ఆయన పాడిన పలు ప్రజా గేయాలు ఉమ్మడి రాష్ట్రంలోని ప్రజలకు అండగా నిలిచాయన్నారు. దళిత జేఏసీ జిల్లా ప్రధాన కార్యదర్శి, కో–ఆప్షన్ సభ్యుడు బేతపూడి రవి, వైఎస్సార్ సీపీ నాయకులు బందెల థామస్‌నోబుల్, బూరగ రామారావు, న్యాయవాది వేణు, సీనియర్ పాత్రికేయుడు కేవీ కృష్ణారావు, కాంగ్రెస్ నాయకుడు ముప్పిడి కోటేశ్వరరావు, ఉపాధ్యాయుడు శీనయ్య, ఉచ్చుల గణేష్, చైతన్య, కోన నాని ఉన్నారు.

**అవనిగడ్డ:** ప్రజా గాయకుడు గద్దర్ మృతికి దళిత, ముస్లిం నేతలు ఘన నివాళులర్పించారు. పంచాయతీ పరిధిలోని సీతాయిలంకలో భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద సోమవారం జరిగిన కార్యక్రమంలో గద్దర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గద్దర్ తన జీవితాన్ని కడవరకూ దళిత, పీడిత వర్గ ప్రజల కోసం ధార పోశారని చెప్పారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ దిడ్ల కిరణ్, దళిత నాయకులు సముద్రాల అంబేడ్కర్, గొరుముచ్చు రవి, కర్రా సుధాకర్, మేడికొండ విజయ్, దిడ్ల ఆనంద్, పోలాబత్తిన నాగరాజు, బాలరాజుతో పాటు దళిత, ముస్లిం నాయకులు పాల్గొన్నారు.

## ఎన్‌సీసీకి 60 మంది విద్యార్థుల ఎంపిక



**గూడూరు:** నేషనల్ కెడెట్ కార్ప్స్(ఎన్‌సీసీ) జూనియర్ విభాగానికి గూడూరు జెడ్పీ హైస్కూల్‌కు చెందిన 60 మంది ఎంపికైనట్లు హెచ్‌ఎం డి.పుష్పలత తెలిపారు. ఎన్‌సీసీ అధికారులు సుబేదార్ మేజర్ కె.బి.రమణ, హవల్దార్ నరేష్‌కుమార్ ఆధ్వర్యంలో సోమవారం ఎంపిక చేపట్టారు. దీనిలో భాగంగా పాఠశాల విద్యార్థులకు దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించగా, పరీక్షల్లో 31 మంది బాలికలు, 29 మంది బాలురు ఎంపికైనట్లు హెచ్‌ఎం తెలిపారు. పీడీలు మత్తి అరుణ, చిలుకోటి రాజేష్ పాల్గొన్నారు.

## ఘనంగా పొన్నమండ లక్ష్మణస్వామి జయంతి



నివాళులర్పిస్తున్న నాయకులు

**అవనిగడ్డ:** అగ్నికుల క్షత్రియ జాతిపిత పొన్నమండ లక్ష్మణస్వామివర్మ 154వ జయంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక అగ్నికుల క్షత్రియ భవనంలో జరిగిన కార్యక్రమంలో లక్ష్మణస్వామి వర్మ చిత్రపటానికి నాయకులు నివాళులర్పించారు. లక్ష్మణస్వామివర్మ చేసిన సేవలను అగ్నికుల క్షత్రియ యూత్ ఫోర్స్ నాయకులు ఒడుగు నాగార్జున, లంకే యుగంధర్ కొనియాడారు. నాయకులు నాగిడి అమలేశ్వరరావు, కోలా వెంకటేశ్వరరావు, నాగిడి గోవింద్, సైకం శ్రీను పాల్గొన్నారు.

**చోరంపూడి గ్రామంలో..**

**బంటుమిల్లి:** మండలంలోని చోరంపూడి గ్రామ రామాలయం వద్ద సోమవారం అగ్నికుల క్షత్రియ పితామహుడు పొన్నమండ లక్ష్మణస్వామి 154వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా రామాలయంలో అగ్నికుల క్షత్రియ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పలువురు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అగ్నికుల క్షత్రియుల కోసం ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు కె.కేశవర్ధన్‌రావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## కొనసాగుతున్న తూడు తొలగింపు పనులు

**బంటుమిల్లి:** మండల పరిధిలోని పలు పంట కాలువల్లో పేరుకుపోయిన తూడు, గుర్రపుడెక్క తొలగింపు పనులు రెండో రోజైన సోమవారం కొనసాగాయి. గత నెలలో కురిసిన భారీ వర్షాలకు పంట కాలువల్లో తూడు, గుర్రపుడెక్క పేరుకుపోయి నీటి ప్రవాహానికి ఆటంకంగా మారాయి. సమస్యను మంత్రి జోగి రమేష్ దృష్టికి తీసుకువెళ్లడంతో స్పందించిన ఆయన అధికారులతో మాట్లాడి తూడు తొలగింపు పనులు చేపట్టాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కృత్తివెన్ను సెక్షన్ ఇరిగేషన్ ఏఈఈ రాజ్యలక్ష్మి మాట్లాడుతూ బంటుమిల్లి మండల పరిధిలోని పెదపట్నం, అర్తమూరు, మణిమేశ్వరం, పెందుర్రు, న్యూకొర్లపాడు, సాల్ట్‌ఫ్యాక్టరీ చానల్, కృత్తివెన్ను మండలం మునిపెడ బ్రాంచి కాలువల్లో పేరుకుపోయిన తూడు, గుర్రపుడెక్క, జంగిల్ క్లియరెన్స్ తదితర అడ్డంకుల తొలగింపు పనులను రెండు రోజులుగా ముమ్మరంగా చేపట్టామన్నారు. అలాగే ఈ కాలువలపై ఏడాది పాటు అమలులో ఉండే విధంగా రూ.20 లక్షలకు టెండరు పనులను గుత్తేదారుకు అప్పగించామన్నారు. ఇందులో భాగంగానే రైతులు ఇబ్బందులు పడకుండా తూడు తొలగింపు పనులు చేపట్టినట్లు ఏఈఈ పేర్కొన్నారు. నీటి ఎద్దడి సమయంలో తూడు తొలగింపుపై రైతులు హర్షం వ్యక్తం చేశారు.

## దశాబ్దాల కల నెరవేరింది

- ఎస్సీ మాస్టిన్‌లకు కుల ధ్రువీకరణ పత్రాలు జారీ చేసిన ఆర్డీవో
- ఫలించిన ఎమ్మెల్యే సింహాద్రి కృషి
- 38 మందికి సర్టిఫికెట్లు మంజూరు




సర్టిఫికెట్లు అందిస్తున్న జెడ్పీటీసీ కళ్యాణి, సర్పంచ్ శ్రీనివాసరావు

**పాగోలు(చల్లపల్లి):** ఎస్సీ మాస్టిన్ కులస్తులకు స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి కుల ధ్రువీకరణ పత్రాలు పొందలేదు. రాజ్యాంగం ప్రకారం ఎస్సీలకు లభించే విద్య, ఉద్యోగ అవకాశాలు పొంది జీవన ప్రమాణాలు మెరుగు పర్చుకునే అవకాశాలను తరతరాలుగా కోల్పోతున్నారు. పురుషులు వడ్రంగి పని, చిరు వ్యాపారాలు, మహిళలు వ్యవసాయ కూలి పనులకు వెళ్తూ జీవనం సాగిస్తున్నారు. కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయాలని ఎంతమంది అధికారులను, ప్రజా ప్రతినిధులను కలిసి వేడుకున్నా ఫలితం లేకుండా పోయింది. చల్లపల్లి మండలం పాగోలు గ్రామంలో 70 ఏళ్లుగా 40 ఎస్సీ మాస్టిన్ కుటుంబాల వారు జీవిస్తున్నారు. కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరు కోసం దశాబ్దాలుగా పోరాటం చేస్తున్నారు.

**సమస్య పరిష్కారం..**

ఇటీవల అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబును కలిసి తమ సమస్య విన్నవించారు. ఆయన చొరవ తీసుకుని మచిలీపట్నం ఆర్డీవో కిషోర్‌తో చర్చించి సమస్య పరిష్కారంపై దృష్టి సారించారు. ఎస్సీ మాస్టిన్ కులస్తులు ఆర్డీఓను కలిసి వినతిపత్రం సమర్పించగా, రెవెన్యూ అధికారులు ఎమ్మెల్యే సూచన మేరకు ఉన్నత అధికారులతో చర్చించి ఎస్సీ మాస్టిన్ కులస్తుల 38 మందికి తొలిసారి కుల ధ్రువీకరణ పత్రాలు జారీ చేశారు. ఈ సర్టిఫికెట్లను సోమవారం గ్రామ సచివాలయంలో జెడ్పీటీసీ సభ్యురాలు రాజులపాటి కల్యాణి, సర్పంచ్ తోట శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యులు మేకా సత్యనారాయణ ప్రసాద్ (బంగారుబాబు), వైఎస్సార్ సీపీ నాయకులు రాజులపాటి శివప్రసాద్, పంచాయతీ ఈఓ ఆకుల సాంబశివరావు, వీఆర్వో జయరాం పంపిణీ చేశారు.


### ఎమ్మెల్యే చొరవతో న్యాయం



మా పిల్లలు కుల ధ్రువీకరణ పత్రాల కోసం అధికారుల చుట్టూ తిరిగారు. ఎస్సీ మాస్టిన్ అని మా కులాన్ని గుర్తించి సర్టిఫికెట్లు ఇవ్వాలని ఎంతో కాలంగా ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నాం. ఈ ప్రభుత్వంలో మా సమస్య పరిష్కారమైంది. ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు చొరవతో మాకు న్యాయం జరిగింది.

– బుద్దుల నాంచారమ్మ, పాగోలు

### అధికారులకు కృతజ్ఞతలు



మా చిన్నప్పటి నుంచి కుల ధ్రువీకరణ పత్రాలు లేవు. ఇటీవల మా గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబుకు సమస్య చెబితే ఆయన అధికారులతో చర్చించారు. దరఖాస్తు చేసిన ప్రతి ఒక్కరికీ కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేశారు. ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబుకు, అధికారులకు ధన్యవాదాలు.

– ఇటికాల అర్జునరావు, పాగోలు

## 19న సర్పంచ్, వార్డు సభ్యుల పదవులకు ఉప ఎన్నిక

**పెడన:** నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో పంచాయతీల్లో ఉప ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఎన్నికల సంఘం నోటిఫికేషన్ జారీ చేసిందని ఎంపీడీవో వి.రెడ్డయ్య తెలిపారు. ఈ నెల 8 నుంచి 10వ తేదీ వరకు ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్లు ఆయా పంచాయతీల కార్యాలయాల్లోనే స్వీకరిస్తారన్నారు. 11న నామినేషన్ల స్క్రూట్నీ, నామినేషన్లపై అభ్యంతరాలుంటే వాటిని 12న తెలియజేయడం, 13న అభ్యంతరాలను పరిశీలించి పరిష్కరించడం, 14న మధ్యాహ్నం 3 గంటల లోపు నామినేషన్లు ఉపసంహరణ, 3 గంటల తరువాత తుది జాబితాల ప్రదర్శన, 19న ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పోలింగ్, మధ్యాహ్నం 2 గంటల నుంచి లెక్కింపు జరుగుతుందని ఎంపీడీవో చెప్పారు.

**ఉప ఎన్నిక జరిగే ప్రాంతాలు..**

పెడన మండలం కొంగంచర్ల సర్పంచ్ లోయ రాజేశ్వరి మృతి చెందడంతో ఆమె స్థానంలో సర్పంచ్ పదవికి ఉప ఎన్నిక నిర్వహించనున్నారు. అలాగే గూడూరు మండలం కోకనారాయణపాలెంలో బండి రమేష్ ఆకస్మికంగా మృతి చెందడంతో అక్కడ ఉప ఎన్నిక జరగనుంది. ఇక బంటుమిల్లి మండలంలోని బంటుమిల్లి 4వ వార్డు, చినతుమ్మిడిలో 8వ వార్డు, గూడూరు మండలం పోలవరంలో 11వ వార్డు, జక్కంచర్ల 1, ఆకులమన్నాడు 2వ వార్డుకు ఉప ఎన్నికలు జరగనున్నాయి. కృత్తివెన్ను మండలం చెరుకుమిల్లి ఐదో వార్డుకు, పెడన మండలం కాకర్లమూడిలో నాలుగో వార్డుకు ఈ నెల 19న ఉప ఎన్నిక నిర్వహించనున్నారు.

**గూడూరు మండల పరిధిలో..**

**గూడూరు:** కోకనారాయణపాలెం సర్పంచ్ ఉప ఎన్నికతో పాటు జక్కంచర్ల, పోలవరం, ఆకులమన్నాడు వార్డు సభ్యుల ఎన్నికలకు ఎన్నికల కమిషన్ షెడ్యూలు విడుదల చేసింది. కోకనారాయణపాలెం సర్పంచ్, ఆకులమన్నాడు 2వ వార్డు జనరల్ కేటగిరీలకు, జక్కంచర్ల 1వ వార్డు, పోలవరం 11వ వార్డులు మహిళలకు రిజర్వ్ అయ్యాయి.

### తక్షణమే నష్ట పరిహారం అందించండి



రాష్ట్ర మంత్రి మేరుగ నాగార్జునకు మొక్కను అందజేస్తున్న కలెక్టర్ రాజాబాబు చిత్రంలో ఎమ్మెల్యే అనిల్‌కుమార్

**చిలకలపూడి(మచిలీపట్నం):** పామర్రు మండలం నిభానుపూడి గ్రామానికి చెందిన అత్యాచార బాధితురాలి కుటుంబానికి వెంటనే నష్ట పరిహారం చెల్లించాలని రాష్ట్ర సాంఘికశాఖ మంత్రి మేరుగ నాగార్జున కలెక్టర్ పి.రాజాబాబుకు సూచించారు. సోమవారం రాత్రి పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ కార్యాలయానికి విచ్చేసిన మంత్రి మేరుగ నాగార్జునను కలెక్టర్ పి.రాజాబాబు మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కను అందజేశారు. అనంతరం మంత్రి నాగార్జున సంఘటన వివరాలను కలెక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు. బాధితురాలి కుటుంబానికి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం ప్రకారం అందాల్సిన నష్టపరిహారాన్ని త్వరిత గతిన అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

### ప్రకటన

[illegible]

**షెడ్యూల్ :** కృష్ణాజిల్లా, అవనిగడ్డ సబ్‌రిజిస్ట్రారు వారి [illegible] మండలం, [illegible] గ్రామ పంచాయతీ ఏరియాలో [illegible] దస్తావేజు నెం. 175/2012 [illegible] ఆర్.ఎస్. నెం. 88/7 య. 0.26 [illegible] 0.05 [illegible]

[illegible]